ఇక 9 క్యారెట్ల గోల్డ్!

- గొలుసు దొంగతనాలు పెరుగుతున్న క్రమంలో త్వరలో తీసుకొచ్చే యోచనలో కేంద్రప్రభుత్వం
- తులం ధర 25 వేల నుంచి రూ. 30 వేలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): 24-క్యారెట్ల మేలిమి బంగారం గురించి అందరికీ తెలిసిందే. ఆభరణాల తయారీలో 22-క్యారెట్లు, 18-క్యారెట్ల బంగారాన్ని వినియోగిస్తారన్న సంగతి కూడా విదితమే. అయితే, కేంద్రం త్వరలో 9-క్యారెట్ల బంగారాన్ని తీసుకొచ్చే యోచనలో ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు బంగారు నగల వ్యాపారులతో కేంద్రప్రభుత్వం ప్రతినిధులు మంగళవారం భేటీ అయినట్టు జాతీయ పత్రిక 'మింట్' ఓ కథనంలో వెల్లడించింది.

ఎందుకు తీసుకొస్తున్నారు?
24-క్యారెట్ల తులం బంగారం రూ.73 వేలకు పైబడి పలుకుతున్నది. 22-క్యారెట్ల తులం బంగారం ధర కూడా రూ.68 వేల పైమాటే. దీంతో దొంగలు తమ చేతివాటం చూపుతున్నారు. ఎన్సీఆర్బీ గణాంకాల ప్రకారం.. 2021తో పోలిస్తే, 2022లో దేశంలో గొలుసు దొంగతనాలు 32.54 శాతం మేర పెరిగాయి. దీంతో చవక బంగారంపై వినియోగదారులు ఆసక్తి కనబరుస్తున్నట్టు వ్యాపారులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే కేంద్రం 9-క్యారెట్ల బంగారాన్ని తీసుకొచ్చే యోచనలో ఉన్నట్టు సమాచారం.

ధర ఎంత ఉండొచ్చు?
9-క్యారెట్ల తులం బంగారం ధర రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 24-క్యారెట్లు, 22-క్యారెట్ల బంగారం నాణ్యతను ధ్రువీకరించేందుకు ఉద్దేశించిన హాల్‌మార్క్, బీఎస్ఐ ముద్రలు ఈ బంగారంపై కూడా ఉంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా, 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత్ 35 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకోగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 45.5 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకొన్నది. స్విట్జర్లాండ్, యూఏఈ, పెరూ, ఘనా దేశాల నుంచి భారత్ ఎక్కువగా బంగారాన్ని దిగుమతి చేసుకొంటున్నది.

లెస్బియనిజం.. లైంగిక నేరం

కరికులమ్‌లో తిరిగి చేర్చిన ఎన్ఎంసీ

న్యూఢిల్లీ : సొడోమీ, లెస్బియనిజం అసహజ లైంగిక నేరమని చెప్తున్న పాఠ్యాంశాన్ని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) పునరుద్ధరించింది. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ స్టూడెంట్స్ కోసం ఫోరెన్సిక్ మెడిసిన్, టాక్సికాలజీ కరికులమ్‌లో దీనిని మళ్లీ చేర్చింది. కన్నెపొర, దాని రకాలు; దాని వైద్యపరమైన, చట్టపరమైన ప్రాధాన్యం, కన్యత్వం, కన్నె పొర ఛేదన, లెజిటిమసీ, దాని మెడికో-లీగల్ ఇంపార్టెన్స్ అంశాలను కూడా తిరిగి చేర్చింది. వీటిని మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు 2022లో పాఠ్య ప్రణాళిక నుంచి తొలగించారు.

ఉగ్రవాదుల చేతుల్లోకి నాటో ఆయుధాలు!

న్యూఢిల్లీ: నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) కోసం అమెరికా తయారు చేసిన ఆయుధాలు ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్ల చేతికి వెళ్తున్నాయి. ఇవి మన దేశ భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్నాయి. తుపాకులు తదితర ఆయుధాలు పంజాబ్, జమ్ముకశ్మీర్‌లలో పట్టుబడుతున్నాయి. నాటో సంకీర్ణ దళాల వద్ద ఉండే ఈ ఆయుధాలు నల్లబజారులోకి ఏ విధంగా ప్రవేశిస్తున్నాయి? అవి భారత్‌కు ఎలా చేరుతున్నాయి? అనే అంశాలు అంతు బట్టడం లేదు. అఫ్గానిస్థాన్ నుంచి 2021లో అమెరికా దళాలు వైదొలగిన తర్వాత పెద్ద ఎత్తున ఆయుధాలను వదిలిపెట్టాయి. ఇవి తాలిబన్ల వశమయ్యాయి. ఇజ్రాయెల్ వ్యతిరేక ఉగ్రవాదుల వద్ద కూడా ఎం4 అసాల్ట్ రైఫిల్స్ వంటివి ఉండటం ఆందోళన కలిగిస్తున్నది.

స్టెయిన్‌లెస్ స్టీల్ వాడుంటే

శివాజీ విగ్రహం కూలేది కాదు

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో ఇటీవల కూలిపోయిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని స్టెయిన్‌లెస్ స్టీల్‌తో నిర్మించి ఉంటే అది కూలేది కాదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో చేపట్టే నిర్మాణాల్లో తుప్పును నివారించే లోహాలను వాడాలని ఆయన సూచించారు. 35 అడుగుల శివాజీ విగ్రహం కూలడంతో అధికార బీజేపీపై రాజకీయంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తీర ప్రాంతాలకు సమీపంలో నిర్మించే వంతెనల నిర్మాణంలో స్టెయిన్‌లెస్ స్టీల్ వాడాలంటూ తాను గత మూడేండ్లుగా చెబుతున్నానని గడ్కరీ అన్నారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం..

నలుగురు భారతీయులు మృతి

- మృతుల్లో ముగ్గురు హైదరాబాదీలు
- డల్లాస్‌లో కారును ఢీకొన్న ట్రక్కు

దర్శిని వాసుదేవ్, ఆర్యన్ రఘు, ఫరూఖ్ షేక్, లోకేశ్ పలచర్ల

హ్యూస్టన్/హైదరాబాద్, సెప్టెంబర్ 4: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన నలుగురిని భారతీయులుగా పోలీసులు గుర్తించారు. డల్లాస్ సమీపంలో ఓ హైవేపై ఆగి ఉన్న ఎస్‌యూవీని వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టింది. దీంతో కారు పూర్తిగా మంటల్లో దగ్ధమైపోయింది. ఘటన జరిగినప్పుడు కారులో ఉన్న నలుగురు మరణించారు. వీరి మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. దీంతో డీఎన్ఏ, ఇతర ఆధారాల ద్వారా నాలుగు రోజులకు పోలీసులు మృతులను గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్యన్ రఘునాథ్ ఒరంపట్టి, ఫరూఖ్ షేక్, లోకేశ్ పలచర్ల, తమిళనాడుకు చెందిన దర్శిని వాసుదేవ్ ఈ ప్రమాదంలో మరణించినట్టు కొల్లిన్ కౌంటీ షెరిఫ్ కార్యాలయం ధ్రువీకరించింది. ఆర్యన్, ఫరూఖ్ ఇటీవలే టెక్సాస్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేసుకున్నారు. లోకేశ్ చదువు పూర్తి చేసుకొని ఉద్యోగం చేస్తున్నాడు. కార్‌పూలింగ్ యాప్ ద్వారా వీరు ప్రమాదం జరిగిన కారు ఎక్కినట్టు తెలుస్తున్నది.

కేటీఆర్ సంతాపం

హైదరాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తెలంగాణ యువకులు, తమిళనాడుకు చెందిన యువతి మరణించడంపై కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆర్యన్ రఘునాథ్, ఫరూక్ షేక్, లోకేశ్ పాలచర్ల, దర్శిని వాసుదేవన్ (తమిళనాడు) మరణవార్త తనను ఎంతగానో బాధించిందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మీ ఫోన్లకూ చెవులుంటాయ్!

- మీరు మాట్లాడే మాటలు వింటుంటాయి
- కంపెనీలకు మీ అవసరాలు చేరవేస్తాయి
- 'యాక్టివ్ లిజెనింగ్'తో లక్షిత ప్రకటనలు
- అంగీకరించిన అమెరికాకు చెందిన సంస్థ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: 'మెల్లగా మాట్లాడండి.. గోడలకు చెవులుంటాయి' అనే మాటలు ఇప్పటివరకు విన్నాం. ఇక నుంచి 'ఫోన్లకూ చెవులుంటాయి' అని వినే కాలం వచ్చింది. మీ ఫోన్ల ద్వారా మీకు తెలియకుండానే మీ మాటలను కొన్ని కంపెనీలు వింటాయి. మీ అవసరాలను గుర్తిస్తాయి. మీరు ఏం కొనాలనుకుంటున్నారో పసిగడతాయి. మిమ్మల్ని లక్ష్యంగా చేసుకొని ప్రకటనలు గుప్పిస్తాయి. ఇదంతా సాధ్యమే అంటూ ఇంతకాలంగా టెక్ నిపుణులు చెప్తున్నప్పటికీ సరైన ఆధారాలు లేవు. తాజాగా అమెరికాకు చెందిన కాక్స్ మీడియా గ్రూప్(సీఎంజీ) అనే ఓ కంపెనీ తన నివేదికలో ఈ విషయాలను ధ్రువపరిచింది. తమ వద్ద ప్రజల మాటలను వినే 'యాక్టివ్ లిజెనింగ్' సాంకేతికత ఉన్నట్టు ఈ సంస్థ అంగీకరించింది.

ఏం మాట్లాడుకుంటే.. అవే ప్రకటనలు
మనం గూగుల్‌లో ఏదైనా వస్తువు గురించి సెర్చ్ చేసిన తర్వాత మనం ఏ వెబ్‌సైట్ బ్రౌజ్ చేసినా, ఏ యాప్ వినియోగించినా ఆ వస్తువుకు సంబంధించిన ప్రకటనలే కనిపిస్తూ ఉంటాయి. ఆయా కంపెనీలు మన బ్రౌజింగ్ యాక్టివిటీని ట్రాక్ చేసి ఈ రకంగా లక్షిత ప్రకటనలు గుప్పిస్తుంటాయి. ఈ వ్యవహారం ఇప్పుడు మరింత ముదిరిపోయింది. కొన్ని సార్లు మనం ఏ వస్తువు గురించైనా పక్కవారితో మాట్లాడిన తర్వాత మన ఫోన్‌లో ఆ వస్తువుకు సంబంధించిన ప్రకటనలు కనిపిస్తుంటాయి. ఇది మనల్ని ఆశ్చర్యపరిచినా.. యాదృచ్ఛికం కావొచ్చులే అనుకుంటాం. అయితే, ఇది యాదృచ్ఛికం కాదు.. అధునాతన సాంకేతికతతో టెక్ కంపెనీలు పన్నుతున్న పక్కా వ్యూహం. తాము స్మార్ట్‌ఫోన్, స్మార్ట్ టీవీ, వంటి 470 మార్గాల ద్వారా వాయిస్ డాటాను క్యాప్చర్ చేసి, విశ్లేషిస్తామని సీఎంజీ సంస్థ.. తన ఇన్వెస్టర్లకు సమర్పించిన ఒక నివేదికలో పేర్కొన్నట్టు '404 మీడియా' కథనం తెలిపింది.

ఏమిటీ యాక్టివ్ లిజెనింగ్ టెక్నాలజీ?
తాము అభివృద్ధి చేసిన 'యాక్టివ్ లిజెనింగ్' టెక్నాలజీ ద్వారా స్మార్ట్‌ఫోన్ సహా మైక్రోఫోన్స్ ఉండే స్మార్ట్ పరికరాల నుంచి సేకరించిన సమాచారాన్ని కృత్రిమ మేధ(ఏఐ)తో విశ్లేషించి.. వినియోగదారులు ఏం కొనాలనుకుంటున్నారు, వారి ప్రవర్తనను తెలుసుకుంటామని ఈ కంపెనీ చెప్పినట్టు '404 మీడియా' కథనం పేర్కొన్నది. అయితే, ఈ టెక్నాలజీ తమ వద్ద ఉన్నట్టు ఈ సంస్థ బయటపెట్టినప్పటికీ ఇప్పటికే చాలా కంపెనీలు దీనిని వినియోగిస్తుండవచ్చని టెక్ నిపుణులు అనుమానిస్తున్నారు. అందుకే, మనం మాట్లాడుకునే వస్తువులకు సంబంధించిన ప్రకటనలకు మనకు ఇంటర్నెట్‌లో కనిపిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. ఏదైనా యాప్ డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు మైక్రోఫోన్‌ను వినేందుకు అనుమతి ఇవ్వవద్దని, తద్వారా కొంతవరకు ఈ టెక్నాలజీ బారిన పడకుండా ఉండొచ్చని సూచిస్తున్నారు.

జాతీయ భావాలపై జాగ్రత్తగా ఉంటాం: నెట్‌ఫ్లిక్స్

న్యూఢిల్లీ: జాతీయ భావాలు దెబ్బతినకుండా ఇకపై తమ కంటెంట్ విషయంలో జాగ్రత్తగా ఉంటామని ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ హామీ ఇచ్చింది. ఖాందహార్ విమాన హైజాక్ ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన 'ఐసీ-814: ద ఖాందహార్ హైజాక్' సిరీస్‌లో ఇద్దరు హైజాకర్లు భోళా, శంకర్‌ల పేర్లపై వివాదం రావడంతో నెట్‌ఫ్లిక్స్ వివరణ ఇచ్చింది. ఇద్దరు ముస్లిం హైజాకర్ల పేర్ల స్థానంలో హిందువుల పేర్లు పెట్టడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సిరీస్‌లో హైజాకర్ల అసలు పేర్లను జోడించారు.

వెయ్యి పేజీల ఫిర్యాదు పత్రాలతో పొర్లుదండాలు

- కలెక్టరేట్ ముందు అర్ధనగ్న నిరసన
- ఏడేండ్లుగా తిరుగుతున్నా చర్యల్లేవ్
- మధ్యప్రదేశ్‌లో ఓ బాధితుడు ఆవేదన

భోపాల్, సెప్టెంబర్ 4: అవినీతి, అధికారుల అలసత్వంపై అనేక ఫిర్యాదులు చేసినా, తనకు న్యాయం జరగటం లేదంటూ మధ్యప్రదేశ్‌లో ఓ వ్యక్తి వినూత్న నిరసన చేపట్టాడు. వెయ్యి పేజీలతో ఫిర్యాదును రూపొందించిన అతడు, దాన్ని ఒంటికి చుట్టుకొని అర్ధనగ్నంగా మధ్యప్రదేశ్‌లోని నీమచ్ కలెక్టరేట్ ముందు నిరసనకు దిగాడు. కాకరాయి గ్రామానికి చెందిన ముకేష్ ప్రజాపత్ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమానికి హాజరై వినూత్న పద్ధతిలో తన నిరసన వ్యక్తం చేశాడు. 'ఏడేండ్లుగా న్యాయం కోసం పోరాడుతున్నా. చెప్పులు నెత్తిన పెట్టుకొని న్యాయం కోసం వేడుకుంటున్నా. నా గోడు సీఎం మోహన్ యాదవ్ వినాలి' అంటూ తన ఆవేదన వ్యక్తం చేశాడు.

వరదలను అడ్డుకోనందుకు

30 మందికి ఉరిశిక్ష

ఉత్తరకొరియా అధినేత కిమ్ చర్య

ప్యాంగ్యాంగ్, సెప్టెంబర్ 4: ఉత్తరకొరియా నియంత కిమ్ మరో దారుణానికి పాల్పడ్డారు. దాదాపు 30 మంది అధికారులను ఉరి తీయించినట్టు సమాచారం. ఇటీవల వరదలు రావటంతో పాటు కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో చాలా మంది మరణించారు. అనేక మంది నిరాశ్రయులయ్యారు. అయితే, ప్రాణ, ఆస్తినష్టాలు నివారించటంలో అధికారులు విఫలం అయ్యారని.. అందుకే వారినందరినీ ఉరి తీయాలని కిమ్ ఆదేశించినట్టు దక్షిణ కొరియా మీడియా పేర్కొన్నది. గత నెలలో ఆ అధికారులకు మరణ దండన విధించారని వెల్లడించింది.

నైజీరియాలో నరమేధం..

100 మంది మృతి

బోకో హరామ్ మిలిటెంట్ల ఘాతుకం

అబుజా, సెప్టెంబర్ 4: ఆఫ్రికా దేశం నైజీరియాలో బోకో హరామ్ మిలిటెంట్లు ఘాతుకానికి పాల్పడ్డారు. ఓ మార్కెట్‌లో చొరబడి ఇష్టానుసారంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో కనీసం 100మందికిపైగా గ్రామస్తులు మరణించారని రాష్ట్ర పోలీస్ అధికార ప్రతినిధి డంగస్ అబ్దుల్ కరీం బుధవారం మీడియాకు తెలిపారు. ఆదివారం యోబ్ రాష్ట్రంలో తార్‌ముువా కౌన్సిల్ ఏరియాలో 50 మందికిపైగా తీవ్రవాదులు మోటార్ సైకిల్స్‌పై వచ్చి కాల్పులు జరిపారని, భవనాలకు నిప్పు పెట్టారని కరీం చెప్పారు. దేశంలో ఇస్లామిక్ చట్టాన్ని, షరియా పాలన తీసుకురావటమే లక్ష్యంగా బోకో హరామ్ నైజీరియాలో హింసకు పాల్పడుతున్నది.

నవీ ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణం ప్రారంభం

థాణే: నవీ ముంబైలోని ఉల్వేలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవో జే శ్యామల రావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, పారిశ్రామికవేత్త గౌతమ్ సింఘానియా పాల్గొన్నారు. తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరుని దేవాలయం నమూనాలో ఈ ఆలయాన్ని సైతం నిర్మించనున్నారు. ఆలయ నిర్మాణానికి 2023 జూన్ 7న శంకుస్థాపన జరిగింది. ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల స్థలంలో రేమండ్ గ్రూప్ నిర్మిస్తున్నది.

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు పింఛన్ బంద్

మొదటిపేజీ తరువాయి...

కాంగ్రెస్ పార్టీ వారి శాసనసభ సభ్యత్వాలపై అనర్హత వేటు వేసింది. మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో తమ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరినప్పుడు కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని బలోపేతం చేస్తామని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ పేర్కొన్నది. అయితే, ఇదే కాంగ్రెస్ పార్టీ ఇతర రాష్ట్రాల్లో మాత్రం వేరే పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి చేర్చుకుంటున్నది. తెలంగాణనే ఉదాహరణగా తీసుకుంటే.. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల ఇండ్లకు స్వయంగా ముఖ్యమంత్రి వెళ్లి కాంగ్రెస్ కండువాలు కప్పుతున్నారు. ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో ఒకరైన దానం నాగేందర్‌ను కాంగ్రెస్ టికెట్‌పై లోక్‌సభ ఎన్నికల్లోనూ బరిలో నిలిపారు. ఫిరాయింపులపై కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ఈ ధోరణి పట్ల రాజకీయ విశ్లేషకులు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఫిరాయింపులపై కాంగ్రెస్ రాష్ట్రానికో నీతి: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్ పార్టీ తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ రాష్ట్రానికో నీతిని పాటిస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణలో విపక్ష ఎమ్మెల్యేలను పార్టీ ఫిరాయించేలా ప్రలోభాలకు గురిచేస్తున్న ఆ పార్టీ.. హిమాచల్‌లో మాత్రం పార్టీ ఫిరాయించినవారికి పెన్షన్ కట్ చేస్తామని చట్టం తీసుకొచ్చిందని విమర్శించారు. ఫిరాయింపులపై కాంగ్రెస్ చేస్తున్న విన్యాసాలు ఇవి అని ఎక్స్‌లో మండిపడ్డారు.

గౌరవంగా రాజీనామా చేయండి

- కోర్టు తీర్పు ఇవ్వకముందే తప్పకోండి
- తీర్పు ఇచ్చాక 100 శాతం రాజీనామానే!
- సిద్ధరామయ్యకు యెడియూరప్ప సూచన

శివమొగ్గ, సెప్టెంబర్ 4: ముడా కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గౌరవంగా పదవికి రాజీనామా చేయాలని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత యెడియూరప్ప సూచించారు. ఈ కుంభకోణంలో సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చారు. దీనిని ఆయన కోర్టులో సవాల్ చేశారు. అయితే, కోర్టు తీర్పు ఇవ్వకముందే పదవి నుంచి తప్పుకోవాలని యెడియూరప్ప సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 'కోర్టు తీర్పు ఇచ్చాక వంద శాతం సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వస్తుంది. తీర్పు రాకముందే గౌరవంగా రాజీనామా చేయమని సూచిస్తున్నా. ఆయన ప్రమేయం ఉన్న కుంభకోణాలన్నీ నిరూపితం అయినందున, ఇక తప్పించుకునే అవకాశం లేదు' అని పేర్కొన్నారు. సిద్ధరామయ్యపై విచారణ జరగకుండా సెప్టెంబర్ 9 వరకు మధ్యంతర స్టే ఇచ్చిన సంగతి తెలిసిందే.

నిద్రపోతే రూ.10 లక్షల స్టైపెండ్

వేక్‌ఫిట్ ప్రొఫెషనల్ స్లీప్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: హాయిగా నిద్రపోతే జీతం ఇచ్చే జాబ్ ఉంటే ఎంత బాగుండు! అని అనుకుని ఉంటాం కదా. అలాంటి జాబ్ తాము ఆఫర్ చేస్తమంటున్నది వేక్‌ఫిట్ సంస్థ. ప్రముఖ మ్యాట్రెస్ సంస్థ అయిన వేక్‌ఫిట్.. రోజుకు 8 గంటలు నిద్రపోతే రూ.10 లక్షల వరకు స్టైపెండ్ ఇస్తామని చెప్తున్నది. పైగా, నిద్రించటానికి పరుపు కూడా తామే ఉచితంగా ఇస్తామని అంటున్నది. ఈ మేరకు ప్రొఫెషనల్ స్లీప్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను తీసుకొచ్చింది. రెండు నెలల పాటు ఉండే ఈ ఇంటర్న్‌షిప్‌ను వర్క్ ఫ్రమ్ బెడ్ నుంచే చేయొచ్చు. ఈ ఉద్యోగానికి అర్హతలు ఏంటంటే.. రోజుకు 8-9 గంటల పాటు నిద్రపోవాలి. మధ్యాహ్నం సమయంలో 20 నిమిషాల పాటు చిన్న కునుకు తీయాలి. వీకెండ్స్‌లో వీలైతే ఎక్కువసేపు నిద్రపోవాలి. స్లీప్ మెంటార్స్ నిర్వహించే వర్క్‌షాపులకు హాజరవ్వాలి. నిద్రలో 22 సంవత్సరాల అనుభవం ఉంటే చాలు. సెలెక్ట్ అయ్యే ఇంటర్న్‌కు రూ.1 లక్ష, స్లీప్ చాంపియన్‌గా ప్రమోట్ అయ్యేవారికి ఏడాదికి రూ.10 లక్షలు ఇస్తారు. ఆసక్తిగల అభ్యర్థులు వేక్‌ఫిట్ లింక్‌డ్‌ఇన్ పేజీ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

వేతనాలు ఆలస్యంగా ఇస్తే వడ్డీ ఆదా!

నెలకు రూ.3 కోట్లు మిగల్చవచ్చు.. • హిమాచల్ సీఎం సుఖు ప్రకటన

షిమ్ల, సెప్టెంబర్ 4: ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఆలస్యంగా ఇవ్వడాన్ని హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు సమర్థించుకున్నారు. వేతనాలు, పింఛన్లు ఆలస్యంగా ఇవ్వడం వల్ల ప్రతి నెల రూ.3 కోట్లు వడ్డీ ఆదా చేయవచ్చని ఆయన అసెంబ్లీలో ప్రకటించారు. ఆర్థిక సంక్షోభం కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం వేతనాలు సైతం ఇవ్వలేకపోతున్నదని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. దీనిపై సీఎం సుఖు బుధవారం స్పందిస్తూ.. ప్రతి నెల 6వ తేదీ కేంద్రం నుంచి రాష్ట్రానికి రెవెన్యూ లోటు నిధులు(ఆర్‌డీజీ), 10న కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధులు అందుతాయని తెలిపారు. ఈ నిధులు రాకముందే ఒకటో తేదీన వేతనాలు, పింఛన్లు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 7.5 శాతం వడ్డీకి అప్పు చేయాల్సి వస్తున్నదని తెలిపారు. దీంతో నెలకు రూ.3 కోట్లు, ఏడాదికి రూ.36 కోట్ల వడ్డీ భారం పడుతున్నట్టు చెప్పారు. కాగా, ఈ నెల మాత్రం వనరులను ఎలా సమర్థంగా వినియోగించాలో గుర్తించేందుకు వేతనాలు ఆలస్యం చేశామని, గురువారం వేతనాలు, 10న పింఛన్లు ఇస్తామని వెల్లడించారు. అయితే, గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా తీయించిందని బీజేపీ విమర్శిస్తున్నది.

ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిలో

భారత్ టాప్

ఏటా 10.2 మిలియన్ టన్నులు ఉత్పత్తి

న్యూఢిల్లీ: ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిలో భారత్ అగ్రస్థానంలో ఉంది. ప్రతి ఏడాది 10.2 మిలియన్ టన్నుల వ్యర్థాలను ఉత్పత్తి చేస్తున్నది. ఇది తరువాతి పెద్ద కాలుష్య దేశాల కంటే రెండింతలు ఎక్కువని ఒక నివేదిక వెల్లడించింది. యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్‌కు చెందిన పరిశోధకులు తెలిపిన వివరాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 57 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ వ్యర్థాలు ఒక చోటని కాక సముద్ర గర్భం నుంచి కొండ శిఖరాల వరకు, ఆఖరికి మానవ శరీరంలో సైతం పెద్దయెత్తున పేరుకుపోతున్నాయి. ఈ వ్యర్థాల్లో మూడింట రెండు వంతులు ప్రపంచంలోని దక్షిణ దేశాల నుంచే వస్తున్నట్టు ఈ నివేదిక వెల్లడించింది.

మొబైల్ వాడకానికి బ్రెయిన్ క్యాన్సర్‌కు సంబంధం లేదు

డబ్ల్యూహెచ్‌వో అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: మొబైల్ ఫోన్ వాడకానికి, బ్రెయిన్ క్యాన్సర్‌కు ఎలాంటి సంబంధమూ లేదని 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' (డబ్ల్యూహెచ్‌వో) తాజా అధ్యయనం వెల్లడించింది. 1994 నుంచి 2022 వరకు వెలువడిన 63 అధ్యయనాల్ని విశ్లేషించిన పరిశోధకుల బృందం పై విషయాన్ని తేల్చింది. మొబైల్ ఫోన్ నుంచి వెలువడే రేడియో తరంగాలకు, బ్రెయిన్ క్యాన్సర్‌కు సంబంధం లేదని నిర్ధారించారు. గత రెండు దశాబ్దాల్లో వైర్‌లెస్ టెక్నాలజీ బాగా వినియోగంలోకి వచ్చిన తర్వాత, బ్రెయిన్ క్యాన్సర్ కేసుల్లో పెరుగుదల లేదని పరిశోధనకు నేతృత్వం వహించిన 'ఆస్ట్రేలియన్ రేడియోషన్ ప్రొటెక్షన్, న్యూక్లియర్ సేఫ్టీ ఏజెన్సీ' తెలిపింది.

దర్శన్ కంటే నేనే బెటర్

బెంగళూరు, సెప్టెంబర్ 4: హత్య, కిడ్నాప్ ఆరోపణలతో అరెస్టయిన కన్నడ హీరో, నటుడు దర్శన్ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తన ప్రియురాలు పవిత్రా గౌడ్‌ను సామాజిక మాధ్యమంలో వేధిస్తున్నాడన్న కోపంతో తన అభిమాని అయిన రేణుకాస్వామిని అనుచరులతో కలిసి హత్య చేసిన కేసులో దర్శన్, పవిత్రాగౌడ్, అనుచరులను పోలీసులు అరెస్ట్ చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. కాగా, హతుడు రేణుకాస్వామి మొబైల్ కన్పించకపోవడంతో డూప్లికేట్ సిమ్‌ను తీసుకున్న పోలీసులు అతని చాటింగ్‌ను వెలికి తీశారు. రేణుకాస్వామి పవిత్రను దూషిస్తూ అసభ్యకరమైన మెసేజ్‌లతో వేధించే వాడు. ఒకసారి తన జననాంగాల ఫొటోను ఆమెకు పంపి 'దర్శన్ కంటే నానే చాలా బెటర్' అంటూ మెసేజ్ పెట్టాడని పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

మీరేం రాజు కాదు!

- ఇది ఫ్యూడల్ వ్యవస్థ అంతకంటే కాదు
- సీఎం అయితే ఏం చేసినా చెల్లుతుందా?
- ఐఎఫ్ఎస్ అధికారి పోస్టింగ్ విషయంలో ఉత్తరాఖండ్ సీఎం ధామీకి సుప్రీం తలంటు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఐఎఫ్ఎస్ అధికారి రాహుల్ పోస్టింగ్ విషయంలో ఏకపక్షంగా వ్యవహరించిన ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ తీరును సుప్రీంకోర్టు తీవ్ర స్థాయిలో ఆక్షేపించింది. సీఎం అయినంత మాత్రాన ఏదైనా చెల్లుబాటు అవుతుందని అనుకోవద్దని హెచ్చరించింది. సీఎం రాజేమీ కాదన్న న్యాయస్థానం.. మనం ఫ్యూడల్ వ్యవస్థలో ఉన్నామనుకోవద్దని గుర్తు చేసింది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది..

ఏమిటీ కేసు?
రాహుల్ అనే ఐఎఫ్ఎస్ అధికారి కార